క్లుప్తంగా

2న దుకాణాల నిర్వహణకు వేలాలు

శిరివెళ్ల: శ్రీ సర నరసింహస్వామి ఆలయ సమీపంలో వివిధ దుకాణాల నిర్వహణకు గానూ డిశంబర్ 2వ తేదీన బహిరంగ వేలాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ నరసయ్య శుక్రవారం తెలిపారు. టెంకాయలు అమ్ముటకు రూ.25 వేలు, తలనీలాల ప్రోగుకు రూ.50 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. తినుబండారాలు, బొమ్మలు, ఐస్‌క్రీం, కొబ్బరి చిప్పలు ప్రోగు చేసుకొనుటకు రూ.5 వేల చొప్పున డిపాజిట్ చెల్లించాలని సూచించారు. అలాగే భక్తులు సమర్పించిన బియ్యం సేకరించేందుకు రూ.10 వేల ముందుస్తుగా చెల్లించాలని చెప్పారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

గోస్పాడు: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని నంద్యాల మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి సుందర్‌రావు అన్నారు. మండలంలోని కేజీబీవీ, గోస్పాడు హైస్కూళ్లను శుక్రవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు విద్యార్థి దశ నుంచే పర్యావరణాన్ని పరిరక్షించేలా చూడాలన్నారు. కాలుష్య నివారణకు మొక్కలు ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ శిక్షణ రద్దు చేయాలి

గోస్పాడు: ఉపాధ్యాయ శిక్షణ రద్దు చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు విజయరావు డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విజయనగరం, శ్రీకాకుళంలో జరుగుతున్న శిక్షణకు హాజరై ఇద్దరు ఉపాధ్యాయులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. విద్యాసంవత్సరం మధ్యలో శిక్షణ ఆటంకంగా మారిందన్నారు. వేసవి సెలవుల్లో నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో అన్ని జిల్లాల్లో పాఠశాల సమయానికి ఆన్‌లైన్‌లో శిక్షణ జరపాలని కోరారు. ఎక్కడ పడితే అక్కడ ఉపాధ్యాయుల శిక్షణ నిర్వహించడం తగదన్నారు. పీఆర్‌టీయూ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పారిశుద్ధ్య పనులపై సూచనలు చేస్తున్న కమిషనర్

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని క్రాంతినగర్, ఎస్‌కే రోడ్డు, శ్రీనివాస నగర్, తెలుగుపేట తదితర ప్రాంతాల్లో శానిటేషన్ పనులను మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి పరిశీలించారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. సూపర్‌వైజర్లు శానిటేషన్ పనులను ప్రతిరోజూ పరిశీలించాలన్నారు. మస్టర్ పాయింట్స్‌ను, శానిటేషన్ పనులను కమిషనర్ పరిశీలించారు. పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాలని, వార్డుల్లో ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రజలను మోసగిస్తున్న కూటమి నాయకులు

నంద్యాల(అర్బన్): మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు తమ జేబులు నింపుకుంటున్నారే తప్ప ప్రజల గురించి పట్టించుకోవడం లేదని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యూనిస్ ఆరోపించారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ముస్లిం యువతుల పెళ్లిళ్లకు దుల్హన్ పథకం ద్వారా రూ.లక్ష అందిస్తామని ఎన్నికల ముందు చెప్పి, అధికారం చేపట్టి ఆరు మాసాలు అవుతున్నా అమలు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం అప్పుల్లో ఉందంటూ ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు ప్రజలను మో సం చేస్తున్నారన్నారు. ఇలాగే పాలన సాగితే ప్రజలు ఎదురుతిరిగే రోజు వస్తుందని హెచ్చరించారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న అధికారులు

డోన్ టౌన్: అనంతపురంలో ఈ నెల 24, 25వ తేదీల్లో జరిగిన 68వ రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో డోన్ పట్టణానికి చెందిన తన్విరెడ్డి, సాత్విరెడ్డి ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని శుక్రవారం కర్నూలు డీఈఓ సామ్యూల్ పాల్ తన కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ రమణ మాట్లాడుతూ.. వీరిద్దరు డిసెంబర్ 11 నుంచి 17వ తేదీ వరకు పంజాబ్ రాష్ట్రంలోని లుథియానా పట్టణంలో జరిగే జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. కర్నూలు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, కర్నూలు జిల్లా కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, కరాటే మాస్టర్లు ఫయాజ్, జగదీష్ ఉన్నారు.

వ్యవ‘సాయం’గా డ్రోన్

- డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ
- అన్నదాతకు సొమ్ము, సమయం ఆదా
- నూతన విధానం వైపే మొగ్గు చూపుతున్న కర్షకులు



ఎర్రగుడిదిన్నె వద్ద డ్రోన్ ట్యాంకులో పురుగు మందు పోస్తున్న రైతు



జొన్న పైరుకు పురుగు మందు పిచికారీ చేస్తున్న డ్రోన్

రుద్రవరం: వ్యవసాయంలో నూతన సాంకేతిక పరికరాల వినియోగం పెరిగిపోయింది. విత్తు మొదలు దిగుబడులు ఇళ్లకు చేరేవరకు పనులన్నీ యంత్రాలే చేస్తున్నాయి. దీంతో రైతులకు సొమ్ము, సమయం ఆదా అవుతున్నాయి. నిన్నటి వరకు వ్యవసాయ రంగం కూలీలపై ఆధారపడి సాగేది. రాత్రి, పగలు పనులు చేసేవారు. ఉగాది పండుగ వచ్చిందటంటే కాడెద్దులతో సేద్యపు పనులు మొదలెట్టేవారు. ఎద్దుల బండితో ఎరువులు తోలించి చల్లించడం, ఆపై సేద్యపు పనులు పూర్తి చేసేవారు. తొలకరి చినుకులు మొదలు కాగానే విత్తు విత్తేవారు. పంట కాలం పూర్తి కాగానే కూలీలతోనే కోతలు కోయించి కళ్లాలకు తోలించేవారు. కూలీలతోనే కొన్ని రోజుల పాటు నూర్పిడి పనులు చేయించి వచ్చిన దిగుబడులను విక్రయించుకునేవారు. అయినప్పటికీ అటు రైతులు, ఇటు కూలీల జీవనాలు అంతంత మాత్రంగా ఉండేవి. ప్రస్తుతం సాంకేతికత వినియోగం పెరిగింది. వ్యవసాయ పనులు ఏవైనా క్షణాల్లో పూర్తవుతున్నాయి. గతంలో పంటల్లో తెగుళ్ల నివారణకు కూలీల సాయంతో స్ప్రేయర్ల ద్వారా మందు పిచికారీ చేసేవారు. ఓ కూలీ మందును నీటిలో కలిపి స్ప్రేయర్లో పోస్తే మరో కూలీ వీపుపై మోసుకొని పంటకు పిచికారీ చేసేవారు. ఈ క్రమంలో కూలీలు విష ప్రభావంతో ఇబ్బందులు పడేవారు. ఆ అవస్థలకు విరుగుడుగా.. కాల క్రమేణ ట్రాక్టర్లతో పురుగు మందు పిచికారీ చేయడం ప్రారంభించారు. ప్రస్తుతం వీటన్నింటికీ చెక్ పెడుతూ డ్రోన్ ద్వారా పురుగు మందు పిచికారీ చేయిస్తున్నారు. కూలీల అవసరం లేకుండానే రైతు ఒక్కడే డ్రోన్‌లో నీటిలో కలిపిన పురుగు మందు పోస్తే సరిపోతోంది. 4 నిమిషాల్లో ఎకరం పంటపై పిచికారీ పూర్తి చేస్తుంది. అలా చేసేందుకు కేవలం రూ.400 మాత్రమే ఖర్చు అవుతోంది. గతంలో కూలీలు,ట్రాక్టర్ల ద్వారా ఒక ఎకరం పురుగు మందు పిచికారి చేయాలంటే వేలాది రూపాయలు ఖర్చయ్యేవి. ఖర్చు తక్కువ, అతి తక్కువ సమయంలో మందు పిచికారీ పూర్తవుతుండటంతో రైతులు డ్రోన్ల వైపే మొగ్గు చూపుతున్నారు. మండల కేంద్రం రుద్రవరంతో పాటు శ్రీరంగాపురం, చిలకలూరు,పేరూరు,ఎర్రగుడిదిన్నె తదితర గ్రామాల్లో రైతులంతా వారు సాగు చేసిన వరి,మొక్కజొన్న,జొన్న,మినుము వంటి పంటలపై పురుగు మందును డ్రోన్లతో పిచికారీ చేయిస్తున్నారు.



పేరూరు వద్ద ట్రాక్టరుతో పురుగు మందు పిచికారీ

డ్రోన్‌తో పిచికారీ ఎంతో మేలు



పంటలకు డ్రోన్‌తో మందు పిచికారీ చేయడం ఎంతో మేలు. కూలీల సాయంతో పిచికారీ చేస్తే ఎకరాకు ఐదారు ట్యాంకులు స్ప్రే చేయడం వల్ల నీరు ఎక్కువగా ఉండి మందు పవర్ తగ్గుతుంది. డ్రోన్‌తో చేయించడం వల్ల ఒకే ఒక్క ట్యాంకు కేవలం 14 లీటర్ల నీరు మాత్రమే ఉండటంతో మందు బాగా పనిచేస్తుంది. దీంతో తెగుళ్లు, పురుగుల బెడద తగ్గుతుంది. అలాగే కూలీలు పిచికారీ చేయాలంటే ఒక్కో ఎకరానికి గంటకు పైగా సమయం పడుతుంది. అదే డ్రోన్‌తో అయితే కేవలం నాలుగైదు నిమిషాల్లో పూర్తవుతుంది. నాకున్న ఎనిమిదెకరాల్లో వరి సాగు చేశా. ప్రస్తుతం కూలీల సమస్య అధికంగా ఉంది. అందువల్ల గాజులపల్లె నుంచి డ్రోన్ తెప్పించి వరి పైరుకు పురుగు మందు పిచికారీ చేయించాను.

– రమణ,రైతు,



చాగలమర్రి రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న పురోహితులు



భీమలింగేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కనుల పండువగా శివపార్వతుల కల్యాణం

శ్రీరంగాపురం

నంద్యాల(వ్యవసాయం): పట్టణ శివారులోని ప్రథమ నందీశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక మాసం మాస శివరాత్రిని పురస్కరించుకొని ప్రథమనందీశ్వర, కేదారేశ్వర కల్యాణం శుక్రవారం సాయంత్రం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేదపండితులు రాఘవేంద్రశర్మ, ప్రవీణ్‌శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణ వేడుకలను నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ ఈఓ రామానుజన్ మాట్లాడుతూ.. 1వ తేదీ ఆదివారం కార్తీక అమవాస్య రోజున ప్రథమనంది తిరునాల జరుగుతుందన్నారు. ఆ రోజున స్వామి వారికి సామూహిక కుంకుమార్చన, లక్షబిల్వార్చనతో పూజలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల రథోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

వైభవం.. పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

చాగలమర్రి: కార్తీక మాసం చివరి శుక్రవారం సందర్భంగా స్థానిక రామలింగేశ్వర స్వామి ఆలయంలో సాయంత్రం వేద పండితులు అనుముల పవన్ కుమార్ శాస్త్రి వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం జరిపించారు. అలాగే.. ముత్యాలపాడులోని భైరవేశ్వరాలయం, చింతలచెరువులోని భైరవ గుండాల వద్ద వెలసిన శివాలయం, మల్లెవేముల గ్రామంలోని మల్లేశ్వరస్వామి, చాగలమర్రిలోని రామలింగేశ్వరస్వామి, భీమలింగేశ్వరస్వామి, బసవేశ్వరాలయం, చాగలమ్మ అమ్మవారి ఆలయాల్లో భక్తులు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివరామానందస్వామి భక్తులతో కలిసి ఆకాశ దీపాన్ని వెలిగించారు. దాత సుంకు నాగేశ్వరరావు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ వీరంరెడ్డి భాస్కర్‌రెడ్డి, సభ్యులు సల్లా ధనుంజయుడు, కామిశెట్టి మధుసుదన్‌రావు, కార్నటి రోహితేశ్వరరెడ్డి, గుత్తి



శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా స్వాతి వేడుకలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని తెలుగుపేటలో వెలసిన శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు రామ్మూర్తి ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, స్నపన తిరుమంజన సేవ నిర్వహించారు. స్వామివారిని పట్టువస్త్రాలచే అలంకరింపజేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం స్వామి వారికి మహామంగళ హారతి ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వామి పల్లకీ సేవ ఆలయ ఆవరణలో వైభవంగా జరిగింది. నిర్వాహకులు మధుసూదన రాయలు, తదితరులు పాల్గొన్నారు.



అలంకరణలో మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి

కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన కాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో కార్తీక చివరి శుక్రవారం పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం అనంతరం పూజలు నిర్వహించి పూలచే ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమాన్ని నిర్వహించి పుష్పాభిషేకాన్ని నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. అనంతరం రాహుకాల పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. చివరగా నవ విధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కాళీమాత సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈఓ లక్ష్మీనారాయణ, దేవస్థానం చైర్మన్ ఆరవేటి వాసు, విజయ్‌కుమార్, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో కాళికాంబదేవి

భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన





అమ్మవారి శాలలో సామూహిక లక్ష బిల్వార్చనలో పాల్గొన్న మహిళలు, ప్రత్యేక అలంకరణలో కాశీవిశ్వనాథుడు

నంద్యాల(వ్యవసాయం): కార్తీక మాసం పురస్కరించుకొని లోక కల్యాణం కోసం సంజీవనగర్ రామాలయం, అమ్మవారి శాలలో సామూహిక లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా సంజీవనగర్ రామాలయంలో కాశీ విశ్వనాథుడికి పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకం, నిర్వహించి స్వామివారికి సామూహిక లక్ష బిల్వార్చన, పండిట్ శ్రీ యాదవల్లి కార్తికేయశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీభగవత్ సేవా సమాజ్ సభ్యులు సూరయ్య, దేవరశెట్టి శ్రీనివాస్, మధు, తదితరులు పాల్గొన్నారు. అలాగే మెయిన్ బజార్‌లో వెలసిన అమ్మవారి శాలలో మాస శివరాత్రిని పురస్కరించుకొని ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో సామూహిక బిల్వార్చన నిర్వహించారు. అధ్యక్షురాలు ఇందుమతి, శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రవికృష్ణకు పురస్కారం



నంద్యాల(వ్యవసాయం): నిస్వార్థంగా సామాజిక సేవ అందించిన వారికి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఏటా జాతీయ మహాసభల సందర్భంగా ప్రకటించే ప్రతిష్టాత్మక డాక్టర్ జ్యోతిప్రసాద్ గంగూలీ స్మారక పురస్కారానికి నంద్యాలకు చెందిన ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాలుగా నంద్యాలలో చేపడుతున్న వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ పురస్కారాన్ని డిసెంబర్ 27, 28 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న 99వ ఐఎంఏ జాతీయ మహాసభల్లో అందజేయనున్నారని చెప్పారు. అందుకుగాను ఐఎంఏ నాయకులు నందకిశోర్, సుభాష్‌చంద్రబోస్, విజయభాస్కరరెడ్డి తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



ప్రమీల

దొర్నిపాడు: మండల వ్యవసాయాధికారిగా ప్రమీ ల శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె డోన్‌లో ఏఈఓగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఇక్కడి వచ్చారు. ఇక్కడ ఏఓగా విధులు నిర్వహిస్తున్న సునీత ప్రసూతి సెలవుపై వెళ్లడంతో చంద్రశేఖర్‌రెడ్డిని ఇన్‌చార్జ్‌గా నియమించారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

చాగలమర్రి: గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని హౌసింగ్ ఈఈ హరిగోపాల్ లబ్ధిదారులకు సూచించారు. శుక్రవారం స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయం సమీపంలోనున్న జగనన్న కాలనీలో పర్యటించి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. గృహాల నిర్మాణాలను మార్చి నాటికి పూర్తి చేయాలని చెప్పారు. డీఈ విజయ్‌బాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఓబులేసు ఉన్నారు.



చాగలమర్రి జగనన్న కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఈఈ హరిగోపాల్

యోగాతో పనిఒత్తిడి దూరం



యోగా సాధన చేస్తున్న పోలీసు సిబ్బంది

బొమ్మలసత్రం: నిత్యం యోగా సాధన చేయటం వల్ల పోలీసులకు పనిఒత్తిడి దూరమవుతుందని తద్వారా అనారోగ్య సమస్యల నుంచి బయటపడొచ్చని ఏఆర్ అడిషనల్ ఎస్పీ చంద్రబాబు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా ఆదేశాల మేరకు పోలీస్ పరేడ్ డ్రిల్ కార్యక్రమంలో భాగంగా యోగా సాధన నిర్వహించారు. అనంతరం అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ.. పతంజలి మహర్షి ప్రజల ఆరోగ్యం కోసం యోగా ప్రక్రియను అందించారన్నారు. నిత్యం యోగా చేయటం వల్ల మానవ శరీరంలోని ప్రతి నాడి స్పందించి మానసికంగా, శారీరకంగా ఉల్లాసంగా ఉంటారన్నారు. సీఐలు ఇస్మాయిల్, అన్సర్‌బాషా, మంజునాథ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



మాట్లాడుతున్న పాల్‌రాజారావు

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో బర్డ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బర్డ్స్ ఉన్నత పాఠశాల, జూనియర్ ఒకేషనల్ కళాశాల పేద, గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసమేనని డైరెక్టర్, కరస్పాండెంట్ పాల్‌రాజారావు అన్నారు. శుక్రవారం హెచ్‌ఎం సింధూర ఆధ్వర్యంలో పాఠశాల 34వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈఓ-2 న్యామతుల్లా పాఠశాల మొదటి అంతస్తులో కొత్తగా నిర్మించిన తరగతి గదులను ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నంద్యాల ఎస్‌పీజీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జీవలత, ముత్యాలపాడు హెచ్‌ఎం నళిని, ఆళ్లగడ్డ ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షుడు అమీర్‌బాషా, రిటైర్డ్ డీఎఫ్ఓ చాణక్యరాజు పాల్గొన్నారు.

ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలి

దొర్నిపాడు: మండలంలో రబీలో భాగంగా పంటలు సాగు చేసిన రైతులు ప్రీమియం చెల్లించాలని పంటల బీమా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ సూచించారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో పంటల బీమా, రబీ ఈ-క్రాప్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంటల బీమా, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత బీమా పథకం కింద పంటల వారీగా ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలన్నారు. గ్రామాల యూనిట్‌గా శనగ పంటకు ఎకరానికి రూ.84, మండల యూనిట్‌గా జొన్నకు రూ.59, మినుముకు రూ.48, వరికి రూ.126, జిల్లా యూనిట్‌గా వేరుశనగకు రూ.64, ఉల్లికి రూ.90 ప్రకారం ప్రీమియం చెల్లించాల్సి ఉందన్నారు. శనగ, మినుము, జొన్న, ఉల్లి పంటలకు డిసెంబర్ 15లోపు బీమా చేయించుకోవాలని, వరికి మాత్రం డిసెంబర్ 30వరకు గడువు ఉందని చెప్పారు. పొలం, బ్యాంకు పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డు, ఈ-క్రాప్ బుకింగ్ సర్టిఫికెట్‌తో మీసేవలో ఫ్యూచర్ జనరల్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ సంస్థకు ప్రీమియం చెల్లించాలన్నారు. అలాగే రబీ పంటలను రైతులు తప్పని సరిగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. ఏడీఏ సుధాకర్, మండల వ్యవసాయాధికారి ప్రమీల పాల్గొన్నారు.

రైతన్న పాట్లు

దొర్నిపాడు: ఎండుతున్న పంటలను తడుపుకొనేందుకు మండలంలోని రైతులు ప్రయాస పడుతున్నారు. జొన్న, మిరప, పత్తి పంటలకు ప్రస్తుతం నీటి తడులు అవసరం కావడంతో సమీపంలోని నీటి కుంటలు, ఫాంపాండ్స్ నుంచి పైపులు ఏర్పాటు చేసుకొని పంటలకు నీటిని అందిస్తున్నారు. కాగా రెండు రోజులుగా తుఫాను నేపథ్యంలో మేఘాలు కమ్ముకుంటున్నాయి. వర్షం వస్తే కంది, పొగాకు, శనగ పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. జొన్న, మిరప, పత్తి రైతులు మాత్రం వర్షం వస్తే తమకు సాగు నీటి కష్టాలు తప్పుతాయని చెబుతున్నారు.



డబ్ల్యూ గోవిందిన్నె పొలాల్లో జొన్న పైరుకు నీటి తడులు పెట్టేందుకు పైపులను తీసుకెళ్తున్న రైతులు

వైభవం.. పల్లకోత్సవం



బనగానపల్లె రూరల్: నందవరం గ్రామంలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకీలో ఉంచి ఊరేగించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సారా విక్రేతల అరెస్ట్

డోన్ రూరల్: నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి తెలిపారు. పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో శుక్రవారం వివరాలను వెల్లడించారు. ప్యాపిలి మండలం అలేబాద్‌తండా గ్రామంలో దాడులు నిర్వహించామని చెప్పారు. గ్రామానికి చెందిన ముధువత్ బాలు నాయక్, ముధువత్ టిక్కిలీ నాయక్‌లను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వారి నుంచి 190 లీటర్ల సారా, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. బెల్లం ఊటను ధ్వంసం చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎస్ఐలు దౌలత్‌ఖాన్, సోమశేఖర్‌రావు, హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ, సుధాకర్‌రెడ్డి, రంగస్వామి, ఉమాకాంత్‌రెడ్డి, బషీర్ పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌పై అవగాహన

ఆళ్లగడ్డ: విద్యార్థి దశ నుంచే పారిశ్రామిక రంగంపై అవగాహన కలిగి ఉండాలని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజు తెలిపారు. శుక్రవారం కోటకందుకూరు వద్దనున్న మోడల్ స్కూల్లో 9, 10, ఇంటర్ విద్యార్థులకు పారిశ్రామిక పర్యటనలో భాగంగా ఆళ్లగడ్డలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్స్, ఫీడర్స్, బ్రేకర్స్ పనితీరుపై సిబ్బంది అవగాహన కల్పించారు. విద్యుత్‌శాఖ ఏఈ కృష్ణయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు తెలంగాణలో ప్రత్యక్షం

డోన్ టౌన్: రెండు రోజుల క్రితం ఇంటి నుండి బయటికి వెళ్లిన వినయ్‌కుమార్ అనే బాలుడు తెలంగాణ రాష్ట్రం జోగులాంబ జిల్లా శాంతినగర్ పోలీసులకు చిక్కాడు. కొండపేటకు చెందిన బాబు కుమార్ కుమారుడు వినయ్‌కుమార్ పట్టణంలోని రాధాకృష్ణ స్కూల్‌లో 1వ తరగతి చదువుతున్నాడు. స్కూల్‌కు సరిగా వెళ్లక పోవడంతో కొద్ది రోజుల క్రితం పాఠశాల యజమాన్యం సదరు బాలుడికి టీసీ ఇచ్చింది. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిన వినయ్‌కుమార్ తెలంగాణ రాష్ట్రం శాంతినగర్ పోలీసులకు చిక్కాడు. వారు బాలుడి వివరాలను ఆరా తీసి డోన్ పట్టణ పోలీసుల సహాయంతో బాలుడి తండ్రి అడ్రస్ తెలుసుకొని సమాచారం అందించారు. బాలుడి తండ్రి, కుటుంబ సభ్యులు శాంతినగర్‌కు వెళ్లినట్లు తెలిసింది. వినయ్‌కుమార్ సొంతంగా అక్కడికి వెళ్లాడా? లేదా ఎవరైనా తీసుకెళ్లారా? శాంతి నగర్ పోలీసులకు ఎలా చిక్కాడు? అనే విషయాలపై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.



శాంతినగర్ పోలీసు స్టేషన్‌లో ఉన్న వినయ్‌కుమార్

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

రుద్రవరం:బాల్య వివాహాలు చేయడం,ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి అన్నారు. స్థానిక బెస్త కాలనీ 7వ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం మహిళలకు బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు దురాచారమని అలా చేయడం వల్ల బాలికల విద్య,ఆరోగ్యం, రక్షణ,అభివృద్ధి వంటి వాటికి అవరోధాలుగా మారతాయని వివరించారు. బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే 1098 టోల్ ఫ్రీ నంబరుకు సమాచారం అందించాలని సూచించారు .అనంతరం బాల్య వివాహాలు చేయం,ప్రోత్సహించమని మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. అంగన్‌వాడీ కార్యకర్త సువర్ణ ఉన్నారు.

విజేతలకు అభినందన

నంద్యాల(న్యూటౌన్): రాయలసీమ జోనల్ స్థాయి వక్తృత్వ పోటీల్లో గురురాజ విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించినట్లు ఆ విద్యాసంస్థల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి శుక్రవారం అభినందించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వైఎస్సార్ జిల్లా కేంద్రంలో జరిగిన వక్తృత్వ పోటీల్లో విద్యార్థి తారకేశ్వర్ విజేతగా నిలిచాడని, అలాగే పాటల పోటీల్లో మహ్మద్ రఫీ తృతీయ స్థానంలో నిలిచి బహుమతులు అందుకున్నట్లు చెప్పారు.